# దీపావళి

లక్ష్మి నాకంటె ఆటే చిన్నదికాదు. నాకు అక్కచెల్లెళ్ళు లేనట్టే లక్ష్మికి అన్నదమ్ములు లేరు. నాకిద్దరు తమ్ముళ్ళున్నా వున్నారుగాని లక్ష్మికి తోబుట్టువులే లేరు. ఏక సంతానం. ఆపైన మావి ఎదురెదురిళ్ళు కావటంచేత వాళ్ళ ఇల్లు నాకూ, మా ఇల్లు లక్ష్మికీ సొంతయిళ్ళల్లే వుండేవి. లక్ష్మిగారిది రెండతస్తుల మేడ. మాది సామాన్యపు పెంకుటిల్లు. అయినా మా ఇంటిచుట్టూ కాస్త ఆవరణా, చెట్లూ వుండటంచేత లక్ష్మి మా యింటినిచూసి సంతోషించేది. నేనుమటుకు లక్ష్మిగారింటో పాలగచ్చుచూసి సంతోషించేవాణ్ణి.

దీపావళి వస్తే లక్ష్మి తండ్రి దత్తాత్రేయులుగారు నాకుకూడా టపాకాయలు కొనేవారు. మానాన్నకు దీపావళి సరుకుమీద డబ్బు ఖర్చు చెయ్యటమంటే గిట్టదు.

ఆయన 1921 లోనే గాంధీ భక్తుడు కావటంవల్ల దీపావళి ఖర్చు పూర్తిగా మానేశాడు.

దత్తాత్రేయులవారికి దీపావళివస్తే వళ్ళు తెలిసేదికాదు. ఆయన ఒక్క సంవత్సరం నలభై యాభై రూపాయలుకూడా తగలేసేవాడనుకుంటాను.

"తగలెయ్యటాని కంతంత డబ్బు ఖర్చు చెయ్యటం మంచిదికాదండీ, దత్తుగారూ!" అనేవాడు మానాన్న.

"అంతేనా? ఈ టపాకాయలు కాల్చటంవల్ల విషక్రిములెన్ని చస్తయ్? వాటిని చంపటం మనకు విధి."

"జీవహింస."

"అదే మీ కాంగ్రెసుజైనులతో వచ్చిపడ్డది. మలేరియావస్తే నయంచేసు కోరుటయ్యా?"

"ఏదీ? మీరిన్ని దీపావళీలుచేసి ఏ మలేరియాను ఆపగలిగారూ?"

"సరే! ఈ దీపావళే చెయ్యకపోతే రోగాలింకా ఎంత మితిమీరునో."

"పోనీ ఏకంగా ఒక్క పెద్దదీపావళిచేసి అంతటితో పోనివ్వరాదూ?"

"అదీ ఓ ఆలోచనే! కాని ఓటే చిక్కు. ప్రపంచంలోవున్న విషక్రిములన్నీ చచ్చేటంత దీపావళి తలపెడితే ఆ క్రిములతోపాటు మనుషులంతా చస్తారేమో!"

"అందుచేతే మా కాంగ్రెసువాళ్ళకి విషక్రిముల సిద్ధాంతంలో ఆటే విశ్వాసంలేదు. మొత్తంమీద క్రిములన్నీ మంచివేగాని వాటిని ఆత్మశక్తిచేత నిరపాయం చేసుకోవాలని మా సిద్ధాంతం!"

"ఆ ఆత్మశక్తి సాధించేదెట్లాగో మీకూ తెలీదు, మనుష్యులు చావకుండా క్రిములు మాత్రమే చచ్చే దీపావళి ఎట్లాచెయ్యాలో మాకూ తెలీదు? అందుచేత ప్రస్తుతానికి చిన్నచిన్న దీపావళీలతోనే సాగిద్దాం సరేనా?

"మీయిష్టం. మీరు ధనికులు. మీరే నడుం కట్టుకోండి. ఈ దీపావళీల ఖర్చు మామీద పడకుంటా వున్నంతకాలమూ మీకే అభ్యంతరమూలేదు. ఈ లోపల ఎవరన్నా మహానుభావులు క్షేమమార్గంచెప్పి ఈ దీపావళీల అవసరం లేకుండా చేస్తారేమో! దానికింకా తరుణం రాలేదు," అన్నాడు.

ఇది 1940 లో — అప్పుడు నేను మూడో ఫారం చదువుతున్నాను. లక్ష్మి 2 క్లాసులు తక్కువ చదువుతున్నది.

"ఏమోయ్, ఈ దీపావళికి ఏంకాలుస్తావు?" అన్నారు దత్తాత్రేయులుగారు నాతో.

"ఏం కాలుస్తానండి? ఏమీ కాల్చను. ఇంకా ఎన్నాళ్ళీ కాల్చటం? పెద్దవాణ్ణి కావటంలా?" అన్నాను.

లక్ష్మికి అదే ఆఖరు దీపావళి. ఆనాడు మతాబాలు కాలుస్తుంటే వాటి కాంతిలో లక్ష్మి మొహం నాకింకా జ్ఞాపకం వుంది. ఆ వల్చని మొహమూ, మెరిసే పెద్దకళ్లూ, సన్నని మెడా, చేతులూ–అంతసన్నగా వుండి అంత నాజూకుగా అందంగా వుండేవాళ్ళు అరుదు.

మతాబాలు కాలుస్తూ వాటిపొగకు లక్ష్మి దగ్గింది.

"ఈ వెధవ మతాబాలు కాల్చికాల్చి దగ్గొస్తున్నది, నువ్వన్నా కాల్చు." అన్నది నన్ను.

"ఏమీ ఫరవాలేదు. పొగమీదికి రాకుండా పట్టుకో," అన్నాను.

కాని లాభంలేకపోయింది. లక్ష్మి దగ్గు జాస్తి అయింది. కళ్ళల్లోకి నీళ్ళు కూడా వచ్చినై.

"వెళ్ళి కాసిని మంచినీళ్ళు తాగమ్మా, అంతగా అయితే కార్తీక పౌర్ణమి నాడు మళ్ళీ కాల్చుకోవచ్చులే!" అన్నాడు దత్తాత్రేయులుగారు.

కార్తీక పౌర్ణమినాటికి లక్ష్మి మంచంలో వుంది. వైద్యులుచూసి క్షయ అన్నారుట.

ఈ సంగతి నాకు మాఅమ్మ ఓరోజు రాత్రి నేనింటికి రాగానే చెప్పింది. వెంటనే నేను ............. బయల్దేరాను. కాని మా..............నన్ను వెళ్ళ వద్దన్నది.

"నీకేమన్నా పిచ్చా, అమ్మా! వెళ్ళినంత మాత్రంచేత క్షయవచ్చి చుట్టు కుంటుందా ఏమిటి" అన్నాను.

"ఏమో, నాయనా, పాపిష్టికాలం," అన్నది మా అమ్మ.

"ఏమిటిది, లక్ష్మి?" అన్నాను.

"మనం పురుగులన్నిటినీ చంపలేదు. కొన్నిటిని వచ్చే దీపావళికి ఉంచేశాం," అని లక్ష్మి నవ్వబోయి దగ్గింది.

లక్ష్మిని చూస్తే నా గుండె నీరయింది. లక్ష్మి క్షయతో చచ్చిపోయినట్టు ఊహించుకోవటానికి ప్రయత్నించాను. కాని సాధ్యం కాలేదు. ఓ మామూలు యంత్రం అయితే అది పని చేస్తున్నప్పుడు కూడా అది మూలబడ్డట్టూ విరిగి

పోయినట్టూ ఊహించుకోవచ్చు ........... మనిషి - తన రోగం గురించి........ ఆ రోగంతోనే ఎట్లా చచ్చిపోతుంది? .... క్షయ క్రిములు - మనం మైక్రోస్కోపులో పెట్టి చూడగల క్రిములు - ఏ శక్తిచేత మనిషిని మంచంలో పడెయ్యగలుగుతై? ఇది మనిషి మనస్సును అంటలేవు గదా .... లక్ష్మిని ఆలోచించకుండా చెయ్యలేవు గదా .... మనిషిని ఎట్లా చంపగలుగుతై? చచ్చిపోతే లక్ష్మి మనస్సు ఏమవుతుంది? క్షయతో లక్ష్మి శరీరం ఏమైనా కానీ, లక్ష్మి మనస్సెందుకు చచ్చిపోవాలి? ఇట్లా ఎందుకు జరగాలి? .... ఓ మనిషిని వెధవ క్రిములు నాలుగు ఊపిరితిత్తులలోనో గుండెలోనో చేరి చంపేస్తుంటే ఏమీ చాతకానట్టు మిగిలిన ప్రపంచమంతా చూస్తూ కూచోటమేనా? ఆ పురుగు లెక్కడుంటయ్యో వైద్యులకు తెలుసు కదా, అక్కడికి ఇంత విషం ఇంజక్షనిస్తే? అసలు మనిషే చస్తుందేమో!.... అదేకామాలు ఈ క్రిముల బలం! అసలు ప్రాణియొక్క దౌర్బల్యమే వాటి బలంకామాలు!... దత్తాత్రేయులుగారు చెప్పిందంతా అబద్ధం! మా నాన్నే నిజం చెప్పాడు. ఈ క్రిముల్ని చంపటానికి ప్రయత్నించి లాభం లేదు. వాటిని ప్రార్థించి మాత్రం ఏం లాభం? వెధవ క్రిముల్ని ఎవరు ప్రార్థిస్తారు? ఆత్మశక్తి? వాటి మీద మన ఆత్మ శక్తి ఏం చూపిస్తాం? వాటి కదేమిటో అర్థం కాదే! మా నాన్న చెప్పిందీ అబద్ధమే....

లక్ష్మి చచ్చిపోతుందనే భయంతో ఏమేమో వెర్రి ఆలోచనలు చేశాను. లక్ష్మి బ్రతికుండగానే ఆమె చావునుగురించి ఆలోచించటం ద్రోహమనిపించింది. కాని ఆలోచించకుండా ఉండటం నా చాతకాలేదు. పైగా లక్ష్మి జబ్బు నయం కావటానికి బాధ్యుణ్ణి నేనే అనిపించింది. ఆ బాధ్యత నిర్వర్తించలేకపోవటం నా అప్రయోజకత్వం అనిపించింది.

నే నదివర కెన్నడూ తెలుసుకోలేదు, కాని ఆ మంచంలో శుష్కించి ఉన్న లక్ష్మి శరీరం చూస్తే నాకు ప్రపంచంలో లక్ష్మికన్న ఎక్కువైనదేదీ లేదనిపించింది. లక్ష్మి చచ్చిపోయిన తరవాత ఈ ప్రపంచంలో నేను మిగిలిన అందరి మాదిరిగా తిని తిరుగుతూ, ఉద్యోగాలకోసం వెతుకుతూ, ఇడ్లెన్లకోసమూ, కాఫీ కోసమూ, సినిమాల కోసమూ ఆరాటపడుతూ ఎట్లా కాలం వెళ్ళబుచ్చుతానో అర్థం కాలేదు. లక్ష్మి చచ్చిపోయిన మరుక్షణం నించీ ఆకాశం మబ్బు కమ్మేసి ఆ మబ్బు ఇక ఎప్పటికీ విడదనిపించింది.

కాని లక్ష్మి వైద్యుల సహాయంతో కోలుకున్నది. చిక్కి కళాహీనమైన ఆమె మొహంలోకి తిరిగి రక్తం వస్తున్న లక్షణాలు కనిపించినై.

"డాక్టర్లు మదనపల్లి పొమ్మన్నారు," అని చెప్పింది లక్ష్మి. నాకు చాలా సంతోషం వేసింది.

"నేను పెద్దవాణ్ణయితే డాక్టర్నవుతాను లక్ష్మి," అన్నాను.

కాని నేను డాక్టర్నెట్లా అవుతాను? స్కూలు ఫైనలు కాగానే నన్ను మా నాన్న సంపాదనలో దించాలని చూస్తున్నాడు. డాక్టరు కావాలంటే చాలా డబ్బవుతుంది. ఈ దీపావళికి చేసే ఖర్చంతా మానేస్తే ఎంతమంది డాక్టర్లు తయారు కావచ్చు?

మదనపల్లి నుంచి అనుకోకుండా లక్ష్మి దగ్గర్నించి ఉత్తరం వచ్చింది.

"నాకు మళ్ళీ టెంపరేచరు వస్తున్నది .... నువ్వీపాటికే డాక్టరై ఉంటే ఎంత బాగుండేది...." అని రాసింది లక్ష్మి.

[ప్రథమ ముద్రణ : రూపవాణి మాసపత్రిక,
దీపావళి సంచిక, అక్టోబరు 1944]